పత్తి అమ్మకాల్లో సందేహాలా.. నివృత్తి చేసుకోండి

నేడు జేడీఎం శ్రీనివాస్‌తో ఈనాడు ఫోన్ ఇన్



పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ (సీసీఐ) సిద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 4,10,632 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. పత్తిలో తేమశాతం ఆధారంగా సీసీఐ ధర నిర్ణయిస్తుంది. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర రావడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. అకాల వర్షాలతో రంగు మారిన పత్తి అమ్మకం ఎలా?.. సీసీఐ నిబంధనలు ఏమిటి? తదితర సందేహాలు రైతులను వేధిస్తున్నాయి. గురువారం కింది నెంబర్లకు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చు. మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు (జేడీఎం) వి.శ్రీనివాస్ సమాధానాలు ఇస్తారు.

- న్యూస్‌టుడే, ఎనుమాముల మార్కెట్

సంప్రదించాల్సిన చరవాణి నెంబరు
73307 33669, 8985131057
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు

రేపు జిల్లాస్థాయి కళా ఉత్సవ పోటీలు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మండల స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఈ నెల 17 శుక్రవారం జిల్లాస్థాయి కళా ఉత్సవ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో డి.వాసంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని డైట్ కళాశాలలో ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయని చెప్పారు. విద్యార్థులు తమ గైడ్ టీచర్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన వారికి నవంబరులో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

60 నిమిషాలు.. 3,300 వాహనాలు



కాజీపేట పాత రైల్వే వంతెనపై రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతి గంటకు ఒకసారి 'న్యూస్‌టుడే' పరిశీలించగా సగటున నిమిషానికి 55 వాహనాలు రాకపోకలు సాగించాయి. అంటే గంటకు 3,300 వాహనాలు ఆ వంతెనపై తిరుగుతున్నాయి.

● కాజీపేట ఆర్వోబీపై ట్రాఫిక్ రద్దీ

ఇదీ పరిస్థితి..

● 1976లో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకొంది. రెండో ఆర్వోబీ నిర్మాణ పనులు పూర్తిచేస్తే దీనిపై సగం ట్రాఫిక్ భారం తగ్గించవచ్చు. పాత వంతెనపై తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి.

● ఉదయం 8 నుంచి 9 మధ్య, సాయంత్రం 4 నుంచి 8 గంటల మధ్య వాహనాల రద్దీ అధికంగా ఉంటోంది.

- న్యూస్‌టుడే, కాజీపేట

పరిశీలించిన సమయం
ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య,
మధ్యాహ్నం 12 నుంచి 1 గంట మధ్య
సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య.

ఒక నిమిషంలో రాకపోకలు సాగించిన వాహనాలు
ఉదయం 8 గంటలకు : 60
మధ్యాహ్నం 1 గంటకు : 48
సాయంత్రం 5 గంటలకు : 58



విభేదాలు వీడి వంతెనను పట్టించుకోండి!

కాజీపేట రైల్వే వంతెన ఉమ్మడి జిల్లా అభివృద్ధిలో కీలకం.. ఇక్కడి అసంపూర్తి వంతెనతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు తమ మధ్య ఉన్న విభేదాలు వీడి దీని నిర్మాణం పూర్తికి కలిసికట్టుగా ముందుకు సాగాలని ప్రజలు కోరుతున్నారు. 1976లో నిర్మించిన వంతెన ఇరుకుగా మారి పెచ్చులూడుతుంది. రోడ్డు మీద గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఎక్కువ వాహనాలు వచ్చినా, ఏదైనా పైన ఆగిపోయినా ట్రాఫిక్ నిలిచిపోతుంది. వీవీఐపీలు వచ్చినప్పుడు ఎలాంటి ట్రాఫిక్ జామ్ కాకూడదని వాహనాలను నిలిపి వేస్తారు. వంతెన మీద వాహనాలు నిలిపివేయడంతో రైళ్లను సమయానికి అందుకోలేక ప్రయాణాలను రద్దు చేసుకున్న వారున్నారు. గత ప్రభుత్వం రూ.78 కోట్లతో కొత్త వంతెన నిర్మాణం చేపట్టింది. రైలు పట్టాలకు ఇరువైపులా నిర్మాణం పూర్తయింది. పట్టాల మీద గడ్డర్ ఏర్పాటు నిలిచిపోయి ఇప్పటికి రెండేళ్లు కావస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసికట్టుగా పనిచేస్తే ఇది వేగంగా పూర్తవుతుంది.

- న్యూస్‌టుడే, కాజీపేట

ఉత్సాహంగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ



వేయి స్తంభాల దేవాలయం వద్ద వరంగల్ కలెక్టర్ నుంచి టార్చ్‌ను అందుకుంటున్న హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద తెలిపారు. బుధవారం వరంగల్‌కు చేరుకున్న సీఎం కప్ టార్చ్‌కు పోచమ్మమైదాన్ వద్ద కలెక్టర్, డీసీపీ రవీందర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సీఎం కప్ పట్ల విస్తృతంగా చైతన్యం కలిగించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొనేలా చూడాలన్నారు. ఎంజీఎం కూడలి, కేఎంసీ, ములుగురోడ్డు మీదుగా వేయి స్తంభాల దేవాలయం వరకు ర్యాలీ సాగింది. అక్కడ హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝాకు టార్చ్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. నవంబరులో సీఎం కప్ పోటీలు ఉంటాయన్నారు. అనంతరం హనుమకొండ చౌరస్తా, సీపీ కార్యాలయం, కాళోజీ కూడలి మీదుగా హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. పరుగులో శిక్షణ కానిస్టేబుళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ షేక్ సలీమా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు గోకుల్, మధు, రతన్‌బోస్, హనుమకొండ జిల్లాల క్రీడల అధికారులు సత్యవాణి, అశోక్‌కుమార్, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు మహ్మద్ అజీజ్‌ఖాన్, కైలాస్‌యాదవ్, రాజేశ్వరరావు, సారంగపాణి, పవన్, పీఈటీ, పీడీల సంఘాల ప్రతినిధులు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

అసలేం జరుగుతోంది?

● మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి

రంగంపేట, న్యూస్‌టుడే

ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయం రోజురోజుకు వేడెక్కుతోంది. మంత్రి కొండా సురేఖపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా కాంగ్రెస్ పెద్దలను కలిసి వరుస ఫిర్యాదులు చేయడం ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. కొన్ని నెలలుగా ఇది అంతర్గతంగా సాగినా ఇటీవల జరిగిన ఘటనలతో బహిర్గతమైంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షిని ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్యనాయకులు కలిశారు. బుధవారం ఉదయం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనూ మాట్లాడే ప్రయత్నం చేసినా సమయం లేకపోవడంతో వాయిదా పడింది. దిల్లీ నుంచి వచ్చాక కలిసే అవకాశం ఉంది.



పార్టీకి నష్టం..

● వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో మంత్రి సురేఖ ఒకవైపు, సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు మరోవైపు ఉండడంపై కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● మంత్రి వ్యవహరిస్తున్న తీరు, ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధిష్ఠానం పెద్దలకు వివరించినట్లుగా తెలిసింది. శాసనసభ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు సుప్రీం అని.. ఏదీ జరిగినా తామే కదా జవాబుదారీ అని టీపీసీసీ అధ్యక్షుడికి వివరించారు. ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా నాయకులను సమన్వయం చేయాల్సిన బాధ్యత జిల్లా మంత్రులపై ఉందని.. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు..

● మంత్రి సురేఖ వాదన మరోలా ఉంది. తమను నమ్ముకున్న కార్యకర్తల కోసం ఉక్కు పిడికిలితో సమాధానం చెబుతామని బహిరంగంగా ప్రకటించారు. పరకాల నియోజకవర్గంతో చాలా అనుబంధం ఉందని, కార్యకర్తలపై దాడులు, పోలీసు కేసులు పెడితే చూస్తూ ఉండాలా? అని వ్యాఖ్యానించారు. గీసుకొండ పోలీసు స్టేషన్‌లో, ధర్మారంలో జరిగిన దాడులు, ఇతర విషయాలను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వివరించినట్లుగా తెలిసింది. పార్టీకి నష్టం కలిగించడం తన ఉద్దేశం కాదని తెలియజేసినట్లు సమాచారం.

త్వరలోనే సమావేశం

వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో త్వరలోనే సమావేశం ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉమ్మడి జిల్లా నాయకులతో మాట్లాడే అవకాశాలున్నాయి. అందర్ని సమన్వయం చేసే బాధ్యత జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగించారు.

కేసు విచారణ సమయంలో బెదిరింపులు

పరకాల, న్యూస్‌టుడే: ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర సమయంలో భారాస ప్రజాప్రతినిధులను, నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటనపై విచారణ జరుగుతున్న సమయంలో పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. దీనిపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ నుంచి పోలీసులకు నోటీసులు వచ్చాయని, విచారణ అధికారులుగా భూపాలపల్లి అదనపు ఎస్పీ, మామునూరు ఏసీపీ ఉన్నారన్నారు. భారాసకు చెందిన వారిని చితకబాది ఇప్పుడు తమ మీదకు వస్తుందని పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ సంతోష్, దామెర ఎస్సై అశోక్‌తో పాటు సస్పెన్షన్‌కు గురై మరో పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఎస్సై దుర్గాప్రసాద్ బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. కొత్తగా కేసులు బనాయిస్తున్నారని, ఇళ్లకు కానిస్టేబుళ్లను పంపి తెల్ల కాగితాలపై సంతకాలు చేయించారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఫోన్‌లో సీపీ దృష్టికి తీసుకెళ్లామని, తమ పార్టీ వారిపై అక్రమ కేసులు బనాయించిన అధికారులకు శిక్ష పడేంత వరకు పోరాటం చేస్తామని ధర్మారెడ్డి తెలిపారు.

రాయితీ బియ్యం పట్టివేత

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెద్దమొత్తంలో రాయితీ బియ్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... పరకాలకు చెందిన ఆర్.శివకుమార్ రాయితీ బియ్యం సేకరించి శ్రవణ్‌కుమార్ బిన్ని రైస్‌మిల్లులో నిలువ ఉంచారు. దాన్ని రీసైక్లింగ్ చేస్తూ పౌర సరఫరాల శాఖకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం రావడంతో బుధవారం స్థానిక పోలీసులతో కలిసి మిల్లులో తనిఖీ చేశారు. 325 క్వింటాళ్ల రాయితీ బియ్యం, 187.5 క్వింటాళ్ల నూకలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.12.81 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇలాగైతే కళాశాలలు నిర్వహించలేం'



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు

వరంగల్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు బోధనా రుసుము, ఉపకార వేతనాలు చెల్లించడంలేదని, ఇలాగైతే తాము కళాశాలలు నిర్వహించలేమని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం (టీపీడీఎంఏ) నాయకులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో మూడ్రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు బంద్ చేసి, నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్‌కు వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ప్రావిణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఏడాది కిందట విడుదల చేసిన టోకెన్ నెంబర్లకు సంబంధించిన రూ.600 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేయూ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి జి.వేణుమాధవ్, టీపీడీఎంఏ సభ్యులు శ్రీధర్‌రావు, రవీంద్రనాథ్, వెంకట్, జిల్లా కోఆర్డినేటర్ వేణుమాధవ్ పాల్గొన్నారు.

కొలువుదీరిన గురువులు

డీఎస్సీ-2024 ప్రక్రియ జిల్లాలో పూర్తయింది. విద్యాశాఖ ద్వారా నియామక ఉత్తర్వులు అందుకొన్న 168 మంది ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో బుధవారం రిపోర్టు చేశారు. 22 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సు వారు కొలువులు సాధించారు. తొలిరోజు తరగతి గదిలో పాఠాలు బోధించిన వారు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు వచ్చారు. ఇక మౌలిక వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- న్యూస్‌టుడే, వరంగల్ విద్యావిభాగం

జిల్లాలో పాఠశాలలు..
ప్రాథమిక : 304, ప్రాథమికోన్నత : 60
ఉన్నత పాఠశాలలు : 128
మొత్తం విద్యార్థులు : 32,890
ఇది వరకు ఉన్న ఉపాధ్యాయులు : 2,353
కొత్తగా చేరిన వారు : 168

కల నెరవేరింది.. - పొల్‌సాని సౌజన్య, ఎస్జీటీ



మాది భీమదేవరపల్లి మండలం మల్లారం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. నాకు చిన్నప్పటి నుంచి ఉపాధ్యాయురాలు కావాలన్నదే లక్ష్యం. నాకు హనుమకొండ ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల కేటాయించారు. నా కల నెరవేరి పాఠశాలలో అడుగు పెట్టడం ఎంతో సంతోషంగా ఉంది. మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించా.

11 మంది రిపోర్టు..

కమలాపూర్ : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కలిపి బుధవారం 11 మంది కొత్త ఉపాధ్యాయులు రిపోర్టు చేశారు. వీరిలో ఐదుగురు ఎస్జీటీలు, ఆరుగురు స్కూల్ అసిస్టెంట్‌లు ఉన్నారు. కొన్ని ప్రాథమిక పాఠశాలలకు అవసరం మేరకు ఉపాధ్యాయులను కేటాయించలేదు. వంగపల్లి ప్రాథమిక పాఠశాల్లో 50 మందికిపైగా విద్యార్థులకు ముగ్గురు టీచర్లే ఉన్నారు. మరో ఇద్దరి అవసరం ఉంది.



గుండేడు ప్రాథమికోన్నత పాఠశాలలో రిపోర్టు చేస్తున్న మోహన్ కుమార్

తీరిన ఉపాధ్యాయుల కొరత..

వేలేరు: మండలంలో ఉపాధ్యాయుల కొరత తీరింది. 16 మంది రిపోర్టు చేశారు. వారిలో పది మంది ఎస్జీటీలు, ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. మండలంలో కొత్తవారితో ఖాళీలు పూర్తయ్యాయని ఎంఈవో సీహెచ్ చంద్రమౌళి తెలిపారు.



లోక్యతండాలో బోధిస్తున్న నూతన ఉపాధ్యాయురాలు అంబాల అశ్విని

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తా..

- కన్నూరి రాధ, ములుకనూరు బాలికల ఉన్నత పాఠశాల



భీమదేవరపల్లి : చిన్నప్పటికి నుంచి ఉపాధ్యాయురాలు కావాలన్న లక్ష్యం నెరవేరింది. ములుకనూరు బాలికల ఉన్నత పాఠశాల కేటాయించడం సంతోషంగా ఉంది. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విద్యార్థుల విద్యాభివృద్ధికి నా వంతు కృషి చేస్తా.

తీరిన ఆదర్శ పాఠశాల సమస్య




నూతన ఉపాధ్యాయులతో అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్‌పర్సన్ సఖినాబీ

ఐనవోలు : రాష్ట్రంలో మొదటిసారిగా ఆంగ్ల మాధ్యమ బోధన అమలు చేసిన ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమస్య తీరింది. మూతపడిన పాఠశాలను 2015-16లో అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ సహకారంతో గ్రామస్థులు పునఃప్రారంభించుకున్నారు. పాలకుల సహకారంతో రాష్ట్రంలో మొదటిసారి నర్సరీ నుంచి ఆంగ్ల మాధ్యమ బోధన అమలు చేశారు. ఏటా విద్యా కమిటి కృషితో పదో తరగతి వరకు అప్‌గ్రేడ్ అవుతూ ఉన్నత పాఠశాలగా మారింది. ప్రస్తుతం పాఠశాలలో 530 మంది విద్యార్థులు ఉన్నారు. కొత్త ఉపాధ్యాయ నియామకాల్లో ఐనవోలు మండలానికి 21 మందిని కేటాయించారు. అందులో 8 మంది స్కూల్ అసిసెంట్లు, 8 మంది ఎస్జీటీలను ఒంటిమామిడిపల్లి పాఠశాలకే కేటాయించారు. ఇప్పటి వరకు విద్యా కమిటీ ఏటా ప్రైవేటు టీచర్లను ఏర్పాటు చేసి వేతనాలు అందిస్తూ బోధన చేయించింది.

నేడు విద్యుత్తు ఆర్టిజన్స్ మహాధర్నా

బాలసముద్రం, న్యూస్‌టుడే : నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ భవనం ఎదుట గురువారం మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఛైర్మన్ కె.ఈశ్వర్‌రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ తెలిపారు. విద్యుత్తు సంస్థల్లో 23,667 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించారని, మిగిలిన 19,587 మందికి కన్వర్షన్ ఇప్పించాలన్న డిమాండుతో ధర్నా చేపడుతున్నామన్నారు.

ఇదేందయ్యా ఇది..



జనగామ జిల్లా పాలకుర్తి నియోజక వర్గ కేంద్రం శివారులోని విద్యుత్తు సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ప్రధాన విద్యుత్తు లైన్‌కు పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ఏకంగా 10 అడుగుల మేర చుట్టుకోవడంతో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతూ, తెగిపోయేలా న్నాయి. వాటిని తొలగించి, ముందస్తు ప్రమాదాన్ని నివారించాలని స్థానిక రైతులు, ఆయా మార్గంలో వెళ్లే ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ రణధీర్‌ను వివరణ కోరగా.. తొలగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, పాలకుర్తి

నలుపు వరి.. ఆరోగ్య సిరి



చుట్టూ పచ్చని పొలాలు.. మధ్యలో నల్లగా ఉన్న పంటను చూస్తే తెగులు సోకిందని అనుకుంటే పొరపాటే. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లిలో 15 గుంటల విస్తీర్ణంలో మహిళా రైతు కొప్పుల కోమల బ్లాక్ రైస్ సాగు చేశారు. తన కుమారుడు బెంగళూరులో ఆయుర్వేద డాక్టర్‌గా శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడి నుంచి తెచ్చిన వరి వంగడాన్ని తెచ్చి సాగు చేసినట్లు వివరించారు. ఆరోగ్యకరంగా పలు ప్రయోజనాలు ఉండటంతో పాటు సాగు సులువుగా చేయవచ్చని.. అందుకే బ్లాక్ రైస్ పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకులు రావుల ఉమారెడ్డి తెలిపారు.

– ఈనాడు, హనుమకొండ-న్యూస్‌టుడే, మొగుళ్లపల్లి

ప్రాణాలతో చెలగాటమా?





అసలే జాతీయ రహదారి... వాహనాలు వాయువేగంతో దూసుకెళ్తాయి. జనగామ జిల్లా రఘునాథపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనంపై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ఇలా కనిపించారు. ముందూ వెనక ఎటువంటి ఆసరా లేకుండా ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదవశాత్తు పడితే అంతేసంగతులు..

– ఈనాడు,హనుమకొండ

శిక్షణ పొందుతూ.. ప్రత్యక్షంగా వీక్షిస్తూ..



రామప్ప ఆలయంలో వాలంటీర్ల బృందం

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ల శిక్షణ రెండో రోజు కొనసాగింది. బుధవారం ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేయించారు. అనంతరం కాకతీయ హెరిటేజ్ ట్రస్టు కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు వాలంటీర్లకు శిక్షణ తరగతులను తీసుకున్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు ఎలా వచ్చింది? ఆలయ నిర్మాణ శైలి ఏంటీ? కాకతీయులు వాడిన సాంకేతిక పరిజ్ఞానం ఏంటీ? ప్రపంచ స్థాయిలో ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఇంకెక్కడైనా ఉందా? గుర్తింపునకు ఎలాంటి కారణాలు దోహదపడ్డాయనే అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్యాహ్నం ప్రొఫెసర్ దేవాప్రతాప్ ఆలయ నిర్మాణంలో వాడిన సామగ్రి, వాటి సేకరణ, ప్రత్యేకంగా ఆ సామగ్రినే ఉపయోగించడానికి గల కారణాలు, వాటికిచ్చిన ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ తరగతుల అనంతరం రామప్ప ఆలయానికి చేరుకుని శిక్షణలో తెలుసుకున్న విషయాలను స్వయంగా ఆలయంలో వీక్షించి వాలంటీర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఆలయంలోని రాగిని, నాగిని శిల్పాలు, సాండ్‌బాక్స్ టెక్నాలజీ, కామేశ్వర, కాటేశ్వరాలయ నిర్మాణాలను స్వయంగా చూశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో సామూహికంగా ఫొటోలు దిగారు. కార్యక్రమంలో వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, పర్యాటకశాఖ అధికారి సూర్యకిరణ్, పురావస్తు, పర్యాటక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో యువజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు యువజన సంఘాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా సమన్వయ అధికారి చింతల అన్వేశ్ బుధవారం తెలిపారు. యువజన సంఘాల్లోని సభ్యుల వయసు 18 నుంచి 29లోపు ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న యువజన సంఘాలు నమోదు కోసం సభ్యుల ఆధార్‌కార్డు, సంఘం ప్రతులను హనుమకొండలోని నెహ్రూ యువకేంద్రం కార్యాలయంలో ఈ నెల 19లోపు సమర్పించాలన్నారు. సంక్షేమ కార్యక్రమాల నిర్వహణలో యువజన సంఘాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యమని సమన్వయ అధికారి తెలిపారు. మరిన్ని వివరాలకు 0870 2958776 సంప్రదించాలన్నారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	126
రిటైల్:	148
డ్రెస్డ్:	215
స్కిన్‌లెస్:	244

పత్తి కొనుగోళ్లకు సర్వం సిద్ధం

- కనీస మద్దతు ధర రూ.500 పెంపు
- మార్కెటింగ్ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్

పత్తి కొనుగోలు సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు అన్నదాతలు తెల్లబంగారంతో రావడం ప్రారంభమైంది. దీపావళి నాటికి విక్రయాలు జోరందుకుంటాయి. ఈ క్రమంలో మార్కెటింగ్ శాఖ పత్తి కొనుగోళ్లకు చేస్తున్న ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఎన్ని కొనుగోలు కేంద్రాలను నోటిఫై చేసింది? విపణికి సరకు ఏ మేరకు వస్తోంది? తదితర వివరాలతో వరంగల్ మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు ఉప్పల శ్రీనివాస్‌తో సోమవారం 'ఈనాడు' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు.

ఈనాడు, వరంగల్, ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



ముఖాముఖి

? పత్తి రైతులు సరకుతో మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. ఈసారి కనీస మద్దతు ధర ఏ మేరకు పెరగనుంది?

✔ దసరా పండగ ముగియడంతో రైతులు పెద్ద మొత్తంలో పత్తి పంటతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు వస్తున్నారు. ఈసారి వారికి ధర లాభసాటిగా ఉంటుందని భావిస్తున్నాం. కనీస మద్దతు ధర రూ. 500 పెరిగింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) క్వింటాకు మద్దతు ధర రూ. 7521 చెల్లించనుంది.

? సీసీఐకు విక్రయిస్తే రైతుల ఖాతాల్లో ఎన్ని రోజుల్లో డబ్బులు జమ వుతాయి?

✔ రైతులు ఆధార్ అథెంటిఫికేన్ చేసుకుని ఉంటే కొనుగోలు కేంద్రాల వద్ద పని సులువు అవుతుంది. ఆధార్‌తో లింక్ అవడం వల్ల పత్తి విక్రయించిన రెండు మూడు పని దినాల్లో డబ్బులు ఖాతాల్లో జమవుతాయి.

? పత్తి రైతులకు మార్కెటింగ్ శాఖ అన్ని సౌకర్యాలు కల్పిస్తోందా?

✔ రైతులకు సాంకేతికతను చేరువ చేసేందుకు ఒక వాట్సప్ నెంబర్ (8897281111) కూడా మా శాఖ కొత్తగా ప్రవేశపెట్టింది. అందులోకి రైతులు వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే కావాల్సిన సమాచారం వస్తుంది. ఏ యే జిన్నింగ్ మిల్లులో ఎంత మంది విక్రయాల కోసం వేచిచూస్తున్నారనే వివరాలు తెలుసుకోవచ్చు. ఎనుమాముల మార్కెట్‌లో ఇప్పటికే తాగునీటి వసతి కల్పించాం. విద్యుత్తు సరఫరా, యార్డులను శుభ్రం చేసి పెడుతున్నాం. సీసీఐ కొనుగోలు కేంద్రాలపై కూడా మా సిబ్బంది పర్యవేక్షణ ఉంటుంది. రైతులు పెద్ద ఎత్తున రావడానికి ముందే అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మా శాఖ మంత్రి, ఉన్నతాధికారులతో సమీక్ష సైతం పూర్తయ్యింది.

? సరకు రాక అంచనా గతేడాదికన్నా పెరిగిందా.. తగ్గిందా?

✔ ఇప్పటికే మేం సరకు రాకపై ఒక అంచనా రూపొందించుకున్నాం. గతేడాది 28.72 లక్షలు మెట్రిక్ టన్నులు వచ్చింది. ఈ ఏడాది సరకు రాక మరింత పెరుగుతుందని వ్యవసాయ శాఖ గణాంకాల ద్వారా స్పష్టమైంది. సుమారు 32.09 లక్షలు మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వస్తుందని అంచనా వేశాం. ప్రస్తుతానికి ఎనుమాములకు కొద్ది మొత్తంలో మాత్రమే సరకు వస్తోంది. దీన్ని ప్రైవేటు వ్యాపారులు కొంటున్నారు. వరంగల్, సూర్యాపేట, నల్గొండ, ఆదిలాబాద్, ఖమ్మం, భువనగిరి తదితర జిల్లాల నుంచి అక్టోబరులో సరకు రావడం మొదలవుతుంది. నవంబరులో మిగతా జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో వస్తుంది.

? మద్దతు ధర పెరిగిన నేపథ్యంలో రైతులు ప్రైవేటు వ్యాపారుల కన్నా సీసీఐకే ఎక్కువ పత్తిని విక్రయించే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్ని కేంద్రాలను నోటిఫై చేశారు?

✔ ఉమ్మడి జిల్లాలో 58 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ప్రస్తుతం 28 నోటిఫై చేశాం. త్వరలో వంద శాతం మిల్లులను అందుబాటులోకి తెస్తాం. రైతులు నేరుగా ఆ కేంద్రాలకు తీసుకొచ్చి పత్తిని విక్రయించవచ్చు. కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర వస్తే రైతులు బయట విక్రయించుకోవచ్చు. అప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయి.

? పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చే క్రమంలో రైతులకు మీరిచ్చే సూచనలు ఏమిటి? తేమ శాతం ఎంత వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది?

✔ వచ్చేది చలికాలం కాబట్టి ఉదయం వేళ పత్తిపై తేమ ఎక్కువగా ఉంటుంది. అందుకే తొక్కడానికి సమయం తీసుకోవాలి. లేదంటే తేమ లోపల అలాగే ఉంటుంది.. రైతులు కోసిన వెంటనే తీసుకొస్తే మాయిశ్చర్ ఎక్కువగా నమోదవుతుంది. చాలా మంది రైతులు గ్రేడింగ్ చేయకుండా సరకును తీసుకురావడం వల్ల సీసీఐ వాళ్లు నిరాకరిస్తారు. గ్రేడింగ్ చేయడం మరవొద్దు. తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే సీసీఐ కొనుగోలు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల్లో వే బ్రిడ్జ్ మీదున్న బరువును అన్నదాతలు సరిచూసుకోవాలి.

ఎంజీఎంలో అరుదైన శస్త్రచికిత్స

- మహిళా గొంతుపై థైరాయిడ్ గడ్డ తొలగింపు

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి. . ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలానికి చెందిన జన్ను వరలక్ష్మి(46) గొంతుపై 25 సె.మీ. వెడల్పుతో మెడ చుట్టూ ఆక్రమించి ఉన్న థైరాయిడ్ గడ్డతో పదేళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. మెదడుకు రక్తప్రసారం చేసే నరాలను గడ్డ చుట్టుముట్టడంతో ఆహారం మింగలేకపోతున్నారు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా. . హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా.. ఫలితం కనిపించలేదు. చివరికి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్స చేయడానికి రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. కానీ ప్రాణాలకు హామీ ఇవ్వలేమని చెప్పారు. దిక్కుతోచని పరిస్థితుల్లో 10రోజుల క్రితం ఎంజీఎం ఆసుపత్రి జనరల్ సర్జరీ వైద్య విభాగానికి వచ్చారు. ప్రొఫెసర్ డా. శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో వైద్య బృందం పరీక్షించింది. అన్నిరకాల పరీక్షల అనంతరం బుధవారం సుమారు 5 గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు.



బాధితురాలితో వైద్య బృందం

బాధితురాలి గొంతుపై 25సె.మీ. వెడల్పులో ఉన్న థైరాయిడ్ గడ్డను విజయవంతంగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సలో ప్రొఫెసర్ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు డా. వినోద్‌కుమార్ దుస్సా, సీనియర్ రెసిడెంట్లు, పీజీ వైద్యులున్నారు. శస్త్రచికిత్స అనంతరం బాధితురాలు ఆరోగ్యంగా ఉందని వైద్యులు ధ్రువీకరించారు. కాగా ఇంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సను ఎంజీఎం ఆసుపత్రిలో ఉచితంగా చేశారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న వైద్యులను ఎంజీఎం సూపరింటెండెంట్ డా. చిలుక మురళి అభినందించారు.

ఆర్టీసీ బస్సులకు అనుమతి లేదెందుకు?



వంతెన మీదుగా తిరుగుతున్న ప్రైవేటు వాహనాలు

హనుమకొండ నగరంలో ప్రధానమైన నయీంనగర్ నాలాపై వంతెన నిర్మాణం పూర్తైనా ఆర్టీసీ బస్సులు ఈ మార్గంలో తిరగడం లేదు. ఏటా వర్షాకాలం నాలా పొంగి కాలనీలను ముంచెత్తుతుండటంతో ప్రభుత్వం రూ.7.40 కోట్ల నిధులతో ఈ ఏడాది ఏప్రిల్ 5 నాలా విస్తరణ, వంతెన నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఈ మార్గం గుండా రాకపోకలకు సాగించే ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి నడిపారు. దీనికి అదనంగా టికెట్టుపై రూ.10 అదనంగా వసూలు చేస్తున్నారు. పనులు పూర్తై, ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతున్నా ఆర్టీసీ అధికారులు మాత్రం బస్సులను ములుగు రోడ్డు, పెద్దమ్మగడ్డ మీదుగానే తిప్పుతున్నారు. దీని కారణంగా ప్రయాణికులపై ఆర్థికంగా అదనపు భారం పడటమేకాకుండా.. కరీంనగర్, సిద్దిపేట, వేములవాడ, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేవారికి సమయం కూడా వృథా అవుతోంది. – న్యూస్‌టుడే, హనుమకొండ చౌరస్తా

అవిభక్త కవలలకు 22 ఏళ్లు

- సొంతగ్రామంలో పుట్టినరోజు వేడుకలు

దంతాలపల్లి, న్యూస్‌టుడే: దంతాలపల్లి మండలం బీరిశెట్టి గూడెం గ్రామానికి చెందిన అవిభక్త కవలలు వీణ, వాణి ఇరవై ఏళ్ల అనంతరం తమ సొంతింట్లో పుట్టిన రోజు వేడుకలను జరుపుకొన్నారు. మారగాని మురళి-నాగలక్ష్మి దంపతులకు రెండో సంతానంగా సూర్యాపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వీరు జన్మించారు. 13 ఏళ్ల పాటు నీలోఫర్ ఆసుపత్రిలోనే ఉన్నారు. అనంతరం స్టేట్‌హోంకు తరలించారు. అప్పటి నుంచి అక్కడే పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. స్టేట్‌హోం సూపరింటెండెంట్లు సఫియాఖాన్, సోమలక్ష్మితో కలిసి హైదరాబాద్ నుంచి బీరిశెట్టిగూడెం చేరుకోగా ఈసారి తమ ఇంట్లో బుధవారం 22వ జన్మదినాన్ని జరుపుకొన్నారు. బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం తమను ఆదుకోవాలని, పిల్లలతో కలిసి ప్రతి జన్మదినాన్ని జరుపుకొనేలా అవకామివ్వాలని కోరారు. ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో పలువురు వీరికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



కేక్ తినిపిస్తున్న వీణ-వాణి తల్లిదండ్రులు మురళి-నాగలక్ష్మి

మేడారం జాతరలో శాశ్వత ఏర్పాట్లకు కృషి



వనదేవతలకు కుటుంబసమేతంగా పూజలు నిర్వహిస్తున్న మంత్రి కొండా సురేఖ

మేడారం(తాడ్వాయి), న్యూస్‌టుడే: మా కుల దైవమైన సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి కుటుంబసమేతంగా బుధవారం మేడారం వచ్చి తన మనవడి పుట్టువెంట్రుకలు సమర్పించారు. అమ్మవార్లకు ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత మహా జాతర సందర్భంగా కోరిన కోర్కెలు తీరినందుకు మేడారం వచ్చి మొక్కులు చెల్లించామన్నారు. మేడారాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఎక్కువ అభివృద్ధి చేసిందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో తమ ప్రభుత్వం ఉన్నట్లయితే జాతీయ హోదా దక్కి మరింత అభివృద్ధి చెందేదని తెలిపారు. రాబోయే జాతరనాటికి భక్తులకు అన్ని రకాల శాశ్వత ఏర్పాట్లు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించి ప్రజలకు మేలు జరగాలని దేవతలను వేడుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్ జాదవ్, దేవాదాయశాఖ డీసీ శ్రీకాంత్‌రావు, తహసీల్దారు రవీందర్, ఎంపీవో శ్రీధర్‌రావు, ఆలయ కార్యనిర్వహణాధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

బమ్మెర పర్యాటకాభివృద్ధి పనులపై నీలినీడలు

పాలకుర్తి, న్యూస్‌టుడే

జనగామ జిల్లాలోని బమ్మెర, వల్మిడి, సోమేశ్వరాలయం, పాలకుర్తికి తరాల చరిత్ర ఉంది. ఇక్కడ ఎందరో మహానుభావులు, కవులు, కళాకారులు, పోరాటయోధులు పురుడుపోసుకున్నారు. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వం 2017లో సుమారు రూ.23 కోట్లు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. వల్మిడి, పాలకుర్తిలో 90 శాతం మేర నిర్మాణాలు పూర్తి కాగా, బమ్మెరలో మాత్రం ఏళ్లుగా ఆగుతూ. . సాగుతూ.. వస్తున్నాయి.

40 శాతం మేర నిర్మాణ దశలోనే..

బమ్మెరలో సహజ కవి పోతన చారిత్రక ఆనవాళ్లు ఉన్న ప్రదేశంలోనే సుమారు 4 ఎకరాల స్థలంలో పర్యాటకాభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో పోతన స్మృతివనంతోపాటు గ్రంథాలయం, అక్షరభ్యాస కేంద్రం, విడిది కేంద్రాలు, సమాధి, బావి పునరుద్ధరణ, ఆడిటోరియం తదితరాలు చేపట్టగా, అవి ఇంకా నిర్మాణ దశలోనే మగ్గుతున్నాయి. అలాగే రూ.3 కోట్లతో పోతన కాంస్య విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే కొన్నాళ్లుగా నిలిచిన పనులపై స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషాలు ఇతర శాఖల అధికారులతో పలుమార్లు సమీక్షించారు. చేసిన వాటికి బిల్లులు రాకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇంకా 40 శాతం మేర పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బమ్మెరను అభివృద్ధి చేస్తే పర్యాటకుల రాకతో ఆదాయం పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే సోమేశ్వరాలయం ఆ ఖ్యాతిని దక్కించుకోగా, అక్కడి నుంచి వచ్చే భక్తులు బమ్మెర, వల్మిడి ప్రాంతాలను సైతం సందర్శిస్తున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేసి సరైన వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాల్సి ఉంది.



పురోగతి కనిపించని స్మారక కేంద్రం



అసంపూర్తిగా ఆడిటోరియం నిర్మాణం..

పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి..

- మామిడాల యశస్విని రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే

గత గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే పర్యాటకాభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. పనుల పురోగతి, ప్రతిపాదనలను ప్రభుత్వానికి నివేదించి, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటాం. రానున్న రోజుల్లో పాలకుర్తి, బమ్మెర, వల్మిడి ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా విరాజిల్లేలా కృషి చేస్తా.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: బయోవేస్ట్‌ను మున్సిపల్ చెత్తలో వేస్తూ వ్యాధుల విజృంభణకు కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కాలుష్యనియంత్రణ మండలి అధికారులకు తెలంగాణ వైద్యమండలి సిఫారసు చేసింది. బుధవారం వైద్య మండలి పబ్లిక్ రిలేషన్ కమిటీ ఛైర్మన్ డా.నరేష్‌కుమార్, హెచ్ఆర్‌డీఏ జిల్లా నాయకుడు డా.దొమ్మటి ప్రసన్న.. జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి ఆర్.సునీతను కలిసి సిఫారసు లేఖను అందజేశారు. కొందరు అర్హతలేని వైద్యులు ఇష్టానుసారం ఉపయోగించే మందులపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలుష్య నియంత్రణ చట్టం ప్రకారం బయోమెడికల్ వేస్ట్‌ను మున్సిపాలిటీ చెత్తలో వేయడం నేరమని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని అధికారిణి ఆర్.సునీత హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

స్థలాల క్రమబద్ధీకరణకు నిరీక్షణ!



వార్డు అధికారులతో సమావేశమైన మేయర్ సుధారాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలో ఎల్ఆర్ఎస్(లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం) అర్జీల పరిష్కారంలో పురోగతి కనిపించడం లేదు. 79 వేల దరఖాస్తులు పరిశీలన చేయాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చి.. రెండు నెలలవుతున్నా.. క్షేత్రస్థాయిలో కదలిక లేదు. దీంతో దరఖాస్తుదారులు గ్రేటర్ వరంగల్, కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

● ఎల్ఆర్ఎస్ అర్జీల పరిశీలనలో గ్రేటర్ వరంగల్ వెనుకంజలో ఉంది. పలుమార్లు రాష్ట్ర పురపాలక శాఖ అధికారులు, రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్(డీటీసీపీ) సమీక్షించినా.. పురోగతి లేదు. దీనిని దృష్టిలో ఉంచుకొని నగరంలోని 66 డివిజన్ల వార్డు అధికారులను భాగస్వాములను చేసేందుకు నిర్ణయించారు. బుధవారం మేయర్ గుండు సుధారాణి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు అధికారులతో సమావేశమయ్యారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ముమ్మరం చేసేందుకు తగిన ప్రణాళిక రూపొందించారు. సమావేశంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, సెక్రటరీ విజయలక్ష్మి, ఉప కమిషనర్ ప్రసన్నరాణి, ఇన్‌ఛార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్ తదితరులు పాల్గొన్నారు.

99 వేల దరఖాస్తులు

● ఎల్ఆర్ఎస్ పథకం అమలులోకి వచ్చాక 2020 జనవరి వరకు గ్రేటర్ వరంగల్ పరిధిలో 99 వేల పైచిలుకు అర్జీలు వచ్చాయి. న్యాయపరమైన అడ్డంకులతో నాలుగేళ్ల పాటు ప్రక్రియ ముందుకు సాగలేదు. అర్జీలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం మరోసారి ఆదేశించింది. నగర పరిధిలో 20 వేల అర్జీలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. మరో 79 వేలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ కాపీలు 500-600 మంది దరఖాస్తుదారులకు ఇచ్చారు.

వార్డు అధికారులకు శిక్షణ

● ఎల్ఆర్ఎస్ అర్జీల పరిష్కారం వేగవంతం చేసేందుకు నగరంలోని 66 డివిజన్ల వార్డు అధికారులను రంగంలోకి దింపుతున్నారు. మొబైల్ యాప్ ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన ఇతర అంశాలపై బుధవారం బల్దియా సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. దృశ్యరూప ప్రదర్శన ద్వారా టౌన్‌ప్లానింగ్ అధికారులు సందేహాలు నివృత్తి చేశారు.

● ఒక్కో వార్డు అధికారి వారంలో 1400-1500 దరఖాస్తులు పరిశీలించాలి. వెంటనే ప్రత్యేక మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివాదాలకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ అర్జీలు పరిష్కరించాలని మేయర్ సుధారాణి కోరారు

చెత్త కుప్పలు తొలగింపు..

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: నగరంలోని 6వ డివిజన్ బొక్కలగడ్డ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైలా చెత్త పేరుకుపోయిందని, అది కుక్కల దుర్వాసన వస్తోందని కాలనీకి చెందిన రమేష్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, శుభ్రం చేయించారు.

మురుగు కాలువలు శుభ్రం..

జులైవాడ, న్యూస్‌టుడే : నగరంలోని 7వ డివిజన్ బ్రాహ్మణవాడలో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదని కాలనీకి చెందిన భరత్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను నగరపాలక సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా స్పందించి, ఆ ప్రాంతంలో మురుగు కాలువలు శుభ్రం చేశారు.

స్పందనకు వందనం

తొలగిన వ్యర్థాలు..

హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ చౌరస్తా ప్రధాన రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో వ్యర్థాలు పోగుపడి దుర్వాసన వస్తుందని నగరవాసి వినోద్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. దీనిపై నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కు తెలపగా.. స్పందించి రోడ్డు వెంట వ్యర్థాలను ఎత్తించారు.

నూతన చట్టాలు పక్కాగా అమలు చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఇటీవల అమల్లోకి వచ్చిన నూతన చట్టాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్యారోగ్య, విద్యుత్తు, రవాణా తదితర శాఖల ఉన్నతాధికారులతో నూతన చట్టాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, రోడ్డు భద్రత అంశాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని విభాగాల్లో నూతనంగా అమల్లోకి వచ్చిన చట్టాలను అమలు చేయాలన్నారు. నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. నూతన చట్టాల్లో మహిళలు, చిన్నారుల రక్షణ, భద్రతకు పెద్దపీట వేశారన్నారు. జిల్లాలోని అధికారులు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో గణేష్, డీసీపీ సలీమా, డీఈవో వాసంతి, డీఎంహెచ్‌వో లలితాదేవి, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, ఏసీపీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించండి



సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్, అధికారులు

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో వ్యాపార అనుమతి(ట్రేడ్ లైసెన్సు) రుసుం వసూళ్ల లక్ష్యం రూ.11 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.3 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు. మిగిలిన రూ.8 కోట్ల బకాయిలు వసూలు చేసేందుకు దృష్టి సారించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. బుధవారం సాయంత్రం బల్దియా సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం ఉద్యోగులతో సమావేశమయ్యారు. పారిశుద్ధ్యం, ఇంటింటా చెత్త సేకరణ, వాహనాల మరమ్మతులు, ట్రేడ్ లైసెన్సు ఫీజుల వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీఎంహెచ్‌ఓ డా.రాజిరెడ్డి, ఎంహెచ్‌వో డా.రాజేష్, బయాలజిస్టు మాధవరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మహిళాశక్తి పథకం లక్ష్యాన్ని సాధించాలి

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక లక్ష్యాన్ని కల్పించేందుకు బ్యాంకర్లు సహకరించాలని మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ కోరారు. బుధవారం రాత్రి బ్యాంకర్లు, మెప్మా అధికారులు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో మహిళా శక్తి పథకం ద్వారా 215 స్వయం సహాయక సంఘాల యూనిట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 48 పూర్తయ్యాయని, వ్యక్తిగత యూనిట్లు 1318 లక్ష్యం కాగా 378 పూర్తయ్యాయన్నారు. వివిధ బ్యాంకర్లు సహకారం అందించాలన్నారు. వరంగల్, హనుమకొండ ఎల్‌డీఎంలు రాజా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు విడుదల చేయాలని ధర్నా

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే : ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలోని అశోకా కూడలి వద్ద నిర్వహించిన ధర్నాలో ఆతను మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్‌కుమార్, అభిషేక్, ప్రదీప్, సాయి, సందీప్, రాజ్‌కుమార్, అనూష, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు అవకాశం

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు రాత, ప్రయోగ, సెమినార్ తదితర పరీక్షలు 2024-25 విద్యా సంవత్సరం కాలపరిమితికి సంబంధించి క్లియర్ చేయడానికి అవకాశం కల్పించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేసారు. విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వీటికి సంబంధించిన పరీక్షా రుసుం వివరాలు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

వ్యవసాయ యువ శాస్త్రవేత్త హఠాన్మరణం



సిలివేరు సందీప్ (పాతచిత్రం)

వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం పత్తి విభాగంలో పనిచేస్తున్న యువ శాస్త్రవేత్త డా.సిలివేరు సందీప్ (35) బుధవారం హఠాన్మరణం చెందారు. వరంగల్ పోచనగరికు చెందిన ఆయన 2018లో వ్యవసాయ శాస్త్రవేత్తగా వికారాబాద్ జిల్లా తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో చేరారు. తెలంగాణ కంది-3 రకాన్ని అభివృద్ధి చేశారు. గతేడాది వరంగల్ ప్రాంతీయ పరిశోధన కేంద్రానికి బదిలీపై వచ్చారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఇంట్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండటంతో కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, మూడు, ఆరేళ్ల వయస్సు గల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సందీప్ మృతికి వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏడీఆర్ డా.ఆర్.ఉమారెడ్డి, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.బలరాం, పలువురు శాస్త్రవేత్తలు, ఉద్యోగులు సంతాపం తెలిపారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం

వేలేరు, న్యూస్‌టుడే: పీచరకు చెందిన ఓ యువకుడు బుధవారం ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇంట్లో ఘర్షణపడి మనస్తాపంతో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలపై బుధవారం దాడులు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ తెలిపారు. నడికూడ మండలం కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి, అంజలి కలిసి మండలల్లోని పలు గ్రామాలలో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. రూ.41 వేల విలువ చేసే 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. కేసు నమోదు, విచారణ కోసం దామెర పోలీసులకు అప్పగించామని ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఆర్ఎస్సై బి.శరత్ తదితరులు పాల్గొన్నారు.

పండగకు పంపలేదని వివాహిత బలవన్మరణం



సౌమ్య(పాతచిత్రం)

చేర్యాల, న్యూస్‌టుడే: సద్దుల బతుకమ్మ పండగకు పుట్టింటికి పంపలేదన్న కారణంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో జరిగింది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాల మేరకు.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లికి చెందిన ముక్కెల మంజుల-రాంరెడ్డిల కుమార్తె సౌమ్య (22)ను నాలుగేళ్ల క్రితం ఆకునూరుకు చెందిన పెంటపర్తి శ్రావణ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వారికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. ఇటీవల జరిగిన బతుకమ్మ పండగకు సౌమ్యను ఆమె భర్త పుట్టింటికి పంపలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం ఇంట్లో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. సౌమ్య తల్లి మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

న్యాయం చేయాలని ఠాణా ముందు నిరసన



భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: తమ కుమారుడు ఆషాడపు రాజేష్ మృతికి కారణమైన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని కోరుతూ తల్లిదండ్రులు బుధవారం వంగూరు ఠాణా వద్ద ఆందోళన చేశారు. మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన ఆషాడపు దశరథం, లక్ష్మి దంపతుల కుమారుడు రాజేష్ 2018 మే 09న ఓ వివాహ వేడుకలో నృత్యం చేస్తూ మృతి చెందాడు. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. విష ప్రయోగం జరిగినట్లు పోస్టుమార్టంలో తేలడంతో తల్లిదండ్రులు తొమ్మిది మందిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో అప్పట్లో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కేసు కోర్టులో పెండింగ్ ఉంది. అయితే దశరథం, లక్ష్మి దంపతులు తమకు న్యాయం జరగడం లేదని ఠాణా వద్ద ఫ్లెక్సీతో బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి సీఐ రమేష్, వంగర, ములుకనూర్ ఎస్ఐలు దివ్య, సాయిబాబులు వారితో మాట్లాడారు. పోలీస్ కమిషనర్ వద్దకు తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీలు రద్దు చేయాలి



కరుణాపురం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించిన నాయకులు

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీలోని ఓ వర్గం నాయకులు బుధవారం ఆందోళన చేపట్టారు. కరుణాపురం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన వర్గం వారికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తున్నారని, సమావేశాలకు తమకు కనీసం ఆహ్వానం కూడా అందడం లేదని ఆరోపించారు. రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి వారితో ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కో ఆర్డినేటర్ కొత్తపల్లి భిక్షపతి, నాయకులు బొలెల్ల వికాస్‌రెడ్డి, భైరపాక దివాకర్, పెసరు వెంకటేష్, గొట్టం శ్రీనివాస్, శశికుమార్, ప్రశాంత్, కనకం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీసీలో చోరీ

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: హసన్‌పర్తి సంస్కృతి విహార్‌లోని తెలంగాణ సాంకేతిక శిక్షణ అభివృద్ధి కేంద్రం (టీటీడీసీ)లో చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. టీటీడీసీకి ఈ నెల 8న సాయంత్రం ఆ సంస్థ ఇన్‌ఛార్జి తాళం వేసి వెళ్లారు. ఈ నెల 15న సాయంత్రం తాళం పగులగొట్టి ఉండటాన్ని గుర్తించిన వాచ్‌మెన్ విషయాన్ని అధికారులకు తెలిపారు. వారొచ్చి చూడగా.. రెండు కెమెరాలు, ఒక మానిటర్, 4 సీపీయూలు, 6 పాత ల్యాప్‌ట్యాప్‌లు చోరీకి గురైనట్లు గుర్తించారు. బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానసిక స్థితి సరిగా లేక వృద్ధురాలు..

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: మానసికంగా బాధపడుతున్న వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన రాజేశ్వరి (80) పదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీనికి తోడు నాలుగేళ్ల క్రితం భర్త చనిపోవడంతో మానసికంగా కుంగిపోయింది. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో గడ్డి మందు తాగి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది.

రైలు కిందపడి ఒకరు..

గిర్మాజీపేట: వరంగల్- కాజీపేట స్టేషన్ల మధ్య బుధవారం సాయంత్రం రైలు కిందపడి గుర్తుతెలియని ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. మృతుడికి 30- 35 ఏళ్ల వయసు, 5.6 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగు ఉన్నారని, ఖాకీ ప్యాంటు, రంగుల షర్టు ధరించినట్లు వెల్లడించారు. అతడి కుడిచేతిపై 'అన్న' అని తెలుగులో, ఎడమచేతిపై 'ప్రభ' అని ఆంగ్లంలో రాసి ఉందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతదేహాన్ని ఎంజీఎం ఆసుపత్రిలో భద్రపర్చినట్లు వెల్లడించారు. వివరాలు తెలిసినవారు 97017 47014, 87126 58585 సంప్రదించాలన్నారు.

సంక్షిప్తంగా

నేడు కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి జయంతి వేడుక

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కలెక్టరేట్‌లో గురువారం ఉదయం 10 గంటలకు వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ ప్రావిణ్య హాజరవుతారన్నారు. కుల సంఘాలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విలువలకు కట్టుబడిన వ్యక్తి రతన్ టాటా



రతన్ టాటా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

విద్యానగర్, న్యూస్‌టుడే: నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి రతన్ టాటా అని, ఆయనకు భారత రత్న ఇవ్వాలని పలువురు వక్తలు కోరారు. కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగంలో బుధవారం వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో రతన్ టాటా సంస్మరణ సభ నిర్వహించారు. సొసైటీ ఛైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద సుధాకర్‌రావు, కేయూ పాలక మండలి సభ్యులు అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిట్‌లో ప్రపంచ ఆహార దినోత్సవం

నిట్ క్యాంపస్: వరంగల్ నగరంలోని జాతీయ సాంకేతిక సంస్థ (నిట్)లో బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. 'ఫంక్షనల్ ఫుడ్స్ అండ్ స్మార్ట్ ప్రొటీన్స్ - ఫ్యూచర్ ఆఫ్ న్యూట్రిషన్' అనే థీమ్‌పై కార్యక్రమం నిర్వహించారు. నిట్ సంచాలకుడు ఆచార్య బిద్యాధర్ సుభూది మాట్లాడుతూ.. ఇళ్లలో, వేడుకల సందర్భంగా ఆహారం వృథా చేయకూడదన్నారు. స్థిరమైన ఆహార పద్ధతుల గురించి అవగాహన కల్పించడంలో ప్రపంచ ఆహార దినోత్సవం ముఖ్యపాత్రను వివరించారు. సీఎస్ఐఆర్ మాజీ డైరెక్టర్ సీహెచ్.మోహన్‌రావు, ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, నిట్ న్యూట్రిషన్ బయోకెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ జి.భాను ప్రకాశ్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. టాస్ జోనల్ కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్లు బి.రామరాజు, శ్యామ్, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ఏర్పాట్లకు చర్యలు

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. దొడ్డు, సన్నరకం ధాన్యాల కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలు, మద్దతు ధర తెలిపే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి ఉమారాణి, మేనేజర్ మహేందర్, సహకార అధికారి నీరజ పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరడంలేదు

బాలసముద్రం, న్యూస్‌టుడే : స్వరాష్ట్రం సాధిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని యువత ఆశించి ఉద్యమాలు చేసిందని, ఈ పదేళ్లలో రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరడం లేదని కేయూ విశ్రాంత ఆచార్యులు కె.వెంకటనారాయణ అన్నారు. బాలసముద్రంలోని ఆయన నివాసంలో బుధవారం పుర ప్రముఖులతో కలిసి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ రెండో అతి పెద్ద నగరంగా అభివృద్ధి చెందుతుందనే ఇక్కడి వారి కోరిక నెరవేరడంలేదన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో నేతలు పుల్లూరు సుధాకర్, బొమ్మినేని పాపిరెడ్డి, కాసర్ల రామ్‌రెడ్డి, డాక్టర్ మంద వీరస్వామి పాల్గొన్నారు.

విగ్రహ ధ్వంసంపై నిరసన

హసన్‌పర్తి: సికింద్రాబాద్‌లోని కుమ్మరివాడ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ హైందవ ధర్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల పురోహితులు దహగం రమేశ్‌శర్మ, కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, పురోహితులు వేదాంతం సంపతాచార్యులు, గురుమూర్తి గురుదత్తు, కాజీపేట వెంకటస్వామి, పెద్దమ్మతల్లి ఆలయ అర్చకులు శ్రీనివాస్, రాజరాజేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ కందుకూరి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

భీమదేవరపల్లి: మండలంలోని ములుకనూర్‌లో బుధవారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. పలువురిపై దాడి చేసింది. పారిశుద్ధ్య కార్మికురాలు మాడుగుల పోచమ్మ, గొర్రె లక్ష్మి, గుడికందుల రమేష్, దొండ మహేందర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు దాన్ని వెంబడించి చంపారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

రైల్వే గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ



కాజీపేట, న్యూస్‌టుడే: కాజీపేట రైల్వే కమ్యూనిటీ భవనంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. ఆరోగ్య కార్డులు, గుర్తింపు కార్డుల కోసం ఎక్కువ వినతులు వచ్చాయి. అదనపు వ్యక్తిగత అధికారి జి.జితేందర్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం కొనసాగింది. వివిధ సమస్యలపై సుమారు 600 అర్జీలు వచ్చాయి. ఉమిద్ కార్డులు, పదోన్నతులు, సీనియారిటీ జాబితా, సర్వీసు రికార్డుల్లో, ఫ్యామిలీ డిక్లరేషన్‌లో మార్పులు, చేర్పులపై కార్మికులు వినతులు అందించారు.


ఇంటిపై దాడి.. కేసు నమోదు

ముచ్చర్ల (హసన్‌పర్తి), న్యూస్‌టుడే: పుట్టిన రోజు సందర్భంగా కట్టిన ఫ్లెక్సీ చించారన్న సాకుతో ఓవ్యక్తి ఇంటిపై దాడి చేసి తలుపు, కిటికీ అద్దాలు పగులగొట్టి చంపుతానని బెదిరింపులకు దిగిన ఘటనపై కేసు నమోదైనట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ముచ్చర్లకు చెందిన రాజేశ్ తన పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 15న గ్రామంలో ఫ్లెక్సీ కట్టారు. దాన్ని ఎవరో చించేయగా.. సంపత్‌కుమార్‌పై అనుమానంతో అతడి ఇంటిపై అదేరోజు రాత్రి రాజేశ్ దాడి చేశాడు. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడి మృతి

ధర్మసాగర్, న్యూస్‌టుడే: మండలంలోని నారాయణగిరికి చెందిన కల్లుగీత కార్మికుడు మాటూరి సదానందం (62) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఈ నెల 10న కల్లు కోసం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పడిపోయారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తాటివనం వద్దకు వెళ్లిన భార్య సరోజన గుర్తించి ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా కోలుకోలేక పోయారు.

పత్తి వ్యాపారం పేరుతో గుడుంబా తరలింపు



ఆత్మకూరు, న్యూస్‌టుడే: పత్తి వ్యాపారం పేరుతో గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి బుధవారం స్థానిక పోలీసులు గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. సీఐ సంతోష్ కథనం ప్రకారం.. ఆత్మకూరుకు చెందిన పాండవుల అర్జున్ గ్రామాల్లో పత్తి కొనుగోలు వ్యాపారం చేస్తుంటాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ములుగు జిల్లా రాంనగర్ తండాకు చెందిన బాలు అనే వ్యక్తి వద్ద 40 లీటర్ల గుడుంబా తక్కువ ధరకు కొనుగోలు చేసి ఆత్మకూరులో ఎక్కువ ధరకు విక్రయించేందుకు ద్విచక్రవాహనంపై పత్తి సంచిలో తరలిస్తుండగా ఆత్మకూరు శివారులో బుధవారం పోలీసులు పట్టుకున్నారు. అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

సమాచార హక్కు రక్షణ చట్టం వారోత్సవాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కటాక్షపూర్‌లో సమాచార హక్కు రక్షణ చట్టం పరకాల డివిజన్ కన్వీనర్ నేరెళ్ల అనిల్ గౌడ్ సమాచార హక్కు చట్టం వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం అనేది సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. ఈ చట్టంతో చాలా మంది నిరుపేదలకు న్యాయం జరిగిందన్నారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగ పద్మజ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, ఈసీ రాము పాల్గొన్నారు..

పరకాల నియోజకవర్గం

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

శాయంపేట: ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కరరావు కోరారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించి నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో చంద్రయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా దామెర

దామెర: దామెరను ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు శివం టెంపుల్ ట్రస్టు ఛైర్మన్ బిల్లా రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 20న దామేశ్వర ఆలయంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.